క్లుప్తంగా

వర్షం.. హర్షం



గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్‌లో కురుస్తున్న వర్షం

గోపాలపట్నం: ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజానీకానికి సాయంత్రం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. గోపాలపట్నం పరిసర ప్రాంతాలు కూల్‌కూల్‌గా మారాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ అంతగా ఎండ లేక పోయినా ఉక్కపోతతో స్థానికులు ఇబ్బందిపడ్డారు. సాయంత్రం సుమారు గంట పాటు కురిసిన వర్షంతో వాతావరణం అంతా చల్లగా మారింది. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. వర్షం కారణంగా బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో మురుగు నీరు నిలిచి పోవడంతో ప్రయాణికులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధిలో జవహర్‌నగర్ 11 కేవీ ఫీడర్‌లో వార్షిక మరమ్మతులు చేపట్టనున్న దృష్ట్యా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకుంటుందని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరా కాలనీ–1, ఇందిరాకాలనీ–2,బర్మాకాలనీ,వీటీ కాలేజీ రోడ్డు ఏరియా,జనతాకాలనీ,పవన్‌పుత్ర కాలనీ,జవహర్‌నగర్ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాలో అంతరాయం నెలకుంటుదని ఆయన పేర్కొన్నారు.

అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

సీతంపేట: స్వర సంగమం(హైదరాబాద్), స్వర మాధుర్యం(వైజాగ్) సంస్థల ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. సంస్థ అధ్యక్షుడు డి.ఎం.రావు, కార్యదర్శి పి.వి.రఘుపతి ఆధ్వర్యంలో గాయనీ గాయకులు సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులకు వీనుల విందు చేశారు. గాయనీ గాయకులు ఆనందరెడ్డి, సంపత్‌కుమార్, శ్రియ, శశిరాణి, శైలజ మెరాజ్, మాధవి అద్భుతంగా పాటలు పాడి శ్రోతలను మెప్పించారు.

సమాజంలో లింగ సమానత్వం అవసరం

ఏయూ క్యాంపస్: సమాజంలో లింగ సమానత్వం ఎంతో అవసరమని ఎల్‌పీఎస్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ మహేష్ చప్పా అన్నారు. ఎల్‌పీఎస్ చారిటబుల్ ట్రస్ట్, నేస్తం సోజిక్స్ సంయుక్తంగా ఏయూ తెలుగు మాధ్యమం పాఠశాల విద్యార్థులకు రెండు రోజుల అవగాహన సదస్సు నిర్వహించారు. లింగ సమానత్వం, ఎల్‌జీబీటీక్యూఐఏ హక్కులు, మానవ హక్కులు, వ్యక్తిగత భద్రత తదితర అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. 8 నుంచి 10వ తరగతికి చెందిన 200 మంది విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి అవగాహన కార్యక్రమాలకు తమ సంస్థ తరఫున నిర్వహిస్తామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సలోమి మాట్లాడుతూ ఎంతో సున్నితమైన అంశంపై నిపుణులు విస్తృత అవగాహన కల్పించారన్నారు. జెండర్ స్టడీస్ నిపుణుడు శివ తదితరులు ప్రసంగించారు.

‘అగ్నిపథ్’ను రద్దు చేయాలి


గాజువాక: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ నాయకులు పాతగాజువాక జంక్షన్‌లో బుధవారం ధర్నా చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అచ్యుతరావు మాట్లాడుతూ అగ్నిపథ్ ద్వారా చేపట్టిన నియామకాల్లో ఉద్యోగం కేవలం నాలుగేళ్లు మాత్రమే ఉంటుందన్నారు. యువత తర్వాత నిరుద్యోగులుగా మారుతారన్నారు. దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఆధ్యాత్మిక నిలయం.. బాబా మందిరం

- నేడు బాబా ఆలయ 15వ వార్షికోత్సవం
- కాంతులీతున్న సాయినాథుడి ఆలయం
- విస్తృతంగా ఏర్పాట్లు



విద్యుత్ కాంతుల్లో బాబా ఆకృతి



పూజలు అందుకుంటున్న సాయినాథుడు



విద్యుత్ వెలుగుల్లో సాయిబాబా మందిరం



ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు



భక్తుల కోసం సిద్ధమైన ధ్యాన మందిరం

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సమీపంలోని బుచ్చిరాజుపాలెం(ఏపీఎస్ఈబీ కాలనీ)లో వేంచేసిన షిర్డీ సాయిబాబా ఆలయం ఆధ్యాత్మికతకు నిలయంగా ఉంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి రావడంతో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలో ఆలయ 15వ వార్షికోత్సవ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. గురువారం ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. బాబా దర్శనంతో పాటు పూజలను కనులారా వీక్షించేందుకు పరిసర కాలనీల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో ఆలయ కమిటీ అధ్యక్షుడు విల్లా సత్యనారాయణరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. షిర్డీసాయి ధ్యాన మందిరం నిర్వహణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆలయాన్ని ఆధునీకీకరించారు. ఆలయ ప్రాంగణంలో షామియానాలు వేశారు.

విద్యుత్ వెలుగుల్లో ఆలయ ప్రాంగణం

వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని షిర్డీసాయి బాబా ఆలయంతో పాటు ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వాగత ద్వారం, బాబా నిలువెత్తు చిత్రం ఏర్పాటు చేయంతో ఎంతో ఆకట్టుకుంటుంది. ఆలయం మిరిమిట్లు గొలుపుతూ విద్యుత్ కాంతులీనుతుంది.

నేడు ప్రత్యేక పూజలు

వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 5.15గంటలకు పూజాధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. 6గంటలకు క్షీరాభిషేకం,7 గంటలకు మంగళస్నానం అనంతరం 9గంటలకు పంచామృతాలతో అభిషేకం జరిపించనున్నారు. మధ్యాహ్నం 12గంటలకు హారతి అనంతరం భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ చేయనున్నారు. సాయంత్రం విశేష పూజలు, సామూహిక భజనలు ఉంటాయని ఆలయ అధ్యక్షుడు విల్లా సత్యనారాయణ రావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా ఆశీస్సులు పొందాలని కోరారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్
- 65, 76 వార్డుల్లో అభివృద్ధి పనుల పరిశీలన



పార్కు పనుల తీరును అధికారులను అడిగి తెలుసుకుంటున్న ఏడీసీ విశ్వనాథన్

పెదగంట్యాడ: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ ఆదేశించారు. జీవీఎంసీ 65వ వార్డులోని ఇండోర్ స్టేడియంతో పాటు 76వ వార్డులోని హౌసింగ్ బోర్డు కాలనీలో కొత్తగా చేపట్టిన పార్కు నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతిపై ఆరా తీశారు. పనుల్లో నాణ్యతను పరిశీలించారు. ఏయే పనులు చేస్తున్నారో నిశితంగా చూశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.నాణ్యత విషయంలో రాజీ పడవద్దన్నారు.

ఫ్లై ఓవర్ కింద దర్జాగా వ్యాపారాలు

రాకపోకలకు ఇబ్బందులు



ఫ్లై ఓవర్ కింద కొబ్బరి కాయల నిల్వలు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ కింద రహదారిని ఆక్రమించి కొంతమంది వ్యాపారాలు చేస్తుండడంతో ఆ దారిలో వాహనదారులు, ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఎన్‌ఏడీ సెంటర్ నుంచి మర్రిపాలెం వెళ్లే దారిలో కొబ్బరి కాయలను భారీగా నిల్వ చేస్తుండటంతో సమీపంలో వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు కూడా అవకాశం లేకుండా పోతుందని వాహన దారులు అంటున్నారు. గతంలో లారీలను రోడ్డుకు అడ్డంగా పెట్టి కొబ్బరి కాయలు దింపుతున్న సమయంలో ట్రాఫిక్ పోలీసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీని కూడా అప్పట్లో స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. కానీ మళ్లీ సదరు వ్యాపారులు అదే చోట హోల్ సేల్ వ్యాపారాలు చేస్తుండడంతో తమకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతుందని ప్రయాణికులు చెబుతున్నారు. పోలీసులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని ఎన్‌ఏడీ ప్రాంత వాసులు కోరుతున్నారు.

అంధకారంలో సర్వీస్ రోడ్లు

వాహనచోదకుల అవస్థలు



విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో చీకటి అలముకున్న మల్కాపురంలోని సర్వీసు రోడ్డు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత ప్రధాన సర్వీస్ రోడ్లలో అంధకారం నెలకుంటోంది. ఈ మార్గంలో వెలగాల్సిన విద్యుత్ ఎల్‌ఈడీ లైట్లు మెరయించటంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. జింక్ నుంచి మల్కాపురం వరకు గల ప్రధాన సర్వీస్ మార్గంలో ఐదేళ్ల క్రిందట జీవీఎంసీ అధికారులు విద్యుత్ ఎల్‌ఈడీ షో ల్యాంప్స్‌ను అమర్చారు. ఇవి వేసిన కొత్తలో వెలుగులు పంచేవి. కాలం గడవటంతో విద్యుత్ ఎల్‌ఈడీ లైట్లలో వెలుగులు తగ్గాయి. మల్కాపురం, ఆర్‌కేపురం వంటి ప్రధాన సేవా మార్గాలలో అయితే ఎల్‌ఈడీ షో ల్యాంప్స్ పూర్తిగా మొరాయించటంతో ఆయా ప్రాంతాలు చీకటిలోనే ఉంటున్నాయి. దీంతో రాత్రి సమయంలో ఈ దారిలో రాకపోకలు సాగించే పలువురు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ విద్యుత్ విభాగ అధికారులు స్పందించి, లైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జీవితానుభవాల నుంచే కథలు



మాట్లాడుతున్న రచయిత సుగుణరావు

సీతంపేట: రచయితకు సాంఘిక బాధ్యత ఉండాలని రచయిత డాక్టర్ ఎం.సుగుణరావు అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో జరిగిన కథా కచేరీలో వైవిధ్య భరితమైన కథలను రచయితలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథలనేవి ఆకాశంలోంచి ఊడిపడవని, జీవితానుభవాలే కథలకు ముడిసరుకని పేర్కొన్నారు. కథా వస్తువు కోసం జీవితాన్ని, శైలి కోసం సాహిత్యాన్ని చదవాలని సూచించారు. నడుస్తున్న చరిత్రను రికార్డు చేసే సాంఘిక బాధ్యత రచయితకు ఉండాలన్నారు. పీడిత, తాడిత, దళిత, బహుజన, మహిళావాద దృష్టి కోణం నేపథ్యంలో వచ్చిన వందలాది కథలను అధ్యయనం చేసిన తర్వాతే ఔత్సాహిక రచయితలు కలం పట్టాలన్నారు. రాజకీయ సామాజిక అంశాలు, సమస్యలను ఆకలింపు చేసుకుని నిబద్ధతగా రాసే ప్రతి రచయిత మంచి సృజనకారుడు అవుతాడని చెప్పారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ జీవితం నుంచే కథానికలు వస్తాయని, కథాశిల్పం సరిగా లేకపోతే కథనం దెబ్బతింటుందన్నారు. సిహెచ్.చిన సూర్యనారాయణ, ఎస్.విజయ్‌కుమార్, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత, కె.వి.ఎస్.మూర్తి, పీవీఆర్ కుమారరావు, పరమేశ్వరరావు, రాధారాణి, సురేష్ తదితరులు కథా పఠనం చేశారు.

కూరగాయల పెంపకంపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి సత్యనారాయణరెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

సీతమ్మధార: ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో బుధవారం సీతమ్మధార రైతుబజారులో కూరగాయల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన శాఖాధికారి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పందిరి కూరగాయల సాగు, వేసవిలో పెంపకం, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కూరగాయల పెంపకం, మల్చింగ్ పద్ధతిలో కూరగాయుల సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సాగుపై రాయితీల కోసం వివరించారు. కూరగాయల విత్తనాలు కొనేటప్పుడు క్యాష్ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వారికి ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుందన్నారు. ఆధార్ కార్డు, వన్‌బీ కాపీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ రైతు భరోసా కేంద్రంలో ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ అధికారి ఎస్.కె.యాసిన్, ఉద్యానవన అధికారి జి.సోని, రైతుబజార్ ఈవో పి.కొండబాబు రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు

పెదగంట్యాడ: బాల్య వివాహాలు అనర్థాలకు మూలమని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని కళాజాత కళాకారులు వివరించారు. ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఇస్లాంపేట సెక్టార్ పరిధిలోని రెడ్డి ముసలయ్యపాలెం, పెదనడుపూరు, సీతానగరం–2, దల్లివానిపాలెం, కోనవానిపాలెం తదితర ప్రాంతాలకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన వారి కోసం దుర్గవానిపాలెం సచివాలయం వద్ద బుధవారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులకు, స్థానిక మహిళలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాలల హక్కు చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారం గురించి ఆటపాటలతో వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు చిత్తు



మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు



వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపకులు



గోపాలపట్నం పాఠశాలలో మాదకద్రవ్యాల వల్ల అనర్థాలను వివరిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు

మల్కాపురం: మాదకద్రవ్యాలు సేవించడం వల్ల విలువైన జీవితం నాశనం అవుతుందని ప్రజాపిత బ్రహ్మకుమారి సంస్థ (శ్రీహరిపురం బ్రాంచ్) నిర్వాహకులు సింధూ సిస్టర్ అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 60వ వార్డు గుల్లలపాలెం వాకింగ్ పార్కు వద్ద బుధవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మద్యం,గంజాయి, గుట్కా,పాన్‌పరాగ్ వంటి అలవాట్లకు నేటి యువత దగ్గరవుతున్నారని ఆవేదన చెందారు. వాటిని సేవించడం వల్ల విలువైన యువత జీవితం మధ్యలోనే నిలిచిపోయే పరిస్థితి నెలకుంటుందన్నారు. దేవుడు ఇచ్చిన విలువైన జీవితాన్ని సద్వినియోగం చేసుకొని సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకునే విధంగా నడుచుకోవాలే తప్పా,మాదకద్రవ్యాల జోలికి పోవద్దు అని యువతకు సూచించారు. మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల మానవజీవితం ఎలా నాశనం అవుతుందో పోస్టర్లు ప్రదర్శించారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో చేటు

మత్తు యువత జీవితాన్ని చిత్తు చేస్తుందని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాలు అలవాటు చేసుకుంటే కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి కళాశాల అధ్యాపకులు,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు జ్ఞాపికలు అందించారు.

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో..

గోపాలపట్నం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసుల ఆధ్వర్యంలో గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల నిరోధకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే కలిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం గోపాలపట్నం ప్రధాన రహదారిలో అవగాహన ర్యాలీ చేపట్టారు. సీఐ ఉపేంద్ర మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు కలిగి ఉండడం నేరమని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ జి. దాసు, ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లలితా పీఠంలో దక్షిణామూర్తి ఆరాధన



దక్షిణామూర్తి పరమహంసకు హారతిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీలలితా పీఠం వ్యవస్థాపక పీఠాధిపతి దక్షిణామూర్తి పరమహంస ఆరాధన జరిగింది. లలితానగర్‌లోని పీఠం ఆవరణలో గల దక్షిణామూర్తి మందిరంలో స్వామికి విశేష అభిషేకం, అర్చన అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా కుర్తాళం శంకరాచార్యులు, ప్రస్తుత లలిత పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి స్వయంగా దక్షిణామూర్తికి ప్రత్యేక హారతి సమర్పించారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామిని పాల్గొన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

గాజువాక: జాతీయ న్యాయ సేవ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.షణ్ముఖరావు తెలిపారు. గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న ఈ అదాలత్‌లో అన్ని రకాల బ్యాంకు కేసులు, విద్యుత్, నీరు, టెలిఫోన్, యుటిలిటీ తగాదాలు, రాజీ పడదగ్గ అన్ని క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, పెట్టీ కేసులు, మున్సిపల్ వివాదాలు, పెండింగ్‌లో ఉన్న, ప్రీ లిటిగేషన్ కేసులు రాజీమార్గంలో పరిష్కరిస్తామన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కిటకిటలాడుతున్న కేజీహెచ్

మందుల కౌంటర్ల వద్ద రద్దీ విపరీతం



కేజీహెచ్‌లో మందులు ఇచ్చే గది వద్ద రద్దీ

మహారాణిపేట: కేజీహెచ్‌లో రోగుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. వైద్యం కోసం రోగులు అధిక సంఖ్యలో వస్తున్నారు. దీంతో వారికి మందులు ఇచ్చే కౌంటర్లు కూడా రద్దీగా ఉంటున్నాయి. గత మూడు రోజుల నుంచి మందులు ఇచ్చే కౌంటర్లు రోగులు, వారి సహాయకులతో కిటకిటలాడుతున్నాయి. ఈ రద్దీని దృష్టిలో పెట్టుకొని కేజీహెచ్ సూపరింటెండెంట్, కలెక్టర్ గతంలో కౌంటర్లు పెంచారు. ఓపీ విభాగంలో మూడు కౌంటర్లు, ఆంధ్రా బ్యాంక్ పక్కన అయిదు కౌంటర్లు ఏర్పాటు చేసి ఆధునికీకరించారు. గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, కేజీహెచ్ సిబ్బందికి ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇందులో ఫార్మాసిస్టులతో కౌంటర్లు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ గత మూడు రోజులుగా అన్ని కౌంటర్లూ కిటకిటలాడుతున్నాయి. ఇక్కడి ఆస్పత్రికి ఉమ్మడి విశాఖ నుంచే కాకుండా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళంతోపాటు ఒడిశా, ఉభయ గోదావరి జిల్లాల నుంచి రోగులు వస్తుంటారు. మందుల కోసం రోజు వారీ రోగులే కాకుండా పాత రోగులు కూడా చీటీలు తీసుకొని కౌంటర్లకు వస్తుండడంతో రద్దీ ఎక్కువగా వుంది.

ఆకట్టుకున్న భక్త నత్కీర నాటక ప్రదర్శన



నాటకాన్ని తిలకిస్తున్న సిద్ధేశ్వరానంద మహాస్వామి

సీతంపేట: శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం రంగస్థల కళాకారుడు, పలు నంది పురస్కారాల గ్రహీత డాక్టర్ మీగడ రామలింగస్వామి బృందం ప్రదర్శించిన భక్త నత్కీర నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శ్రీకాళహస్తి మహత్స్యం కావ్యం ఆధారంగా మీగడ రామలింగస్వామి రచించిన ఈ నాటకంలో ఆయన నత్కీరుడు పాత్ర అద్భుతంగా పోషించారు. పాండ్య రాజుగా వి.సత్యం, నారదుడిగా డాక్టర్ అత్తిలి శంకర్, హరద్విజుడుగా ధూపం గురుమూర్తి, మహామంత్రి కె.గోపినాయుడు, మహాశివుడుగా జి.సూర్యనారాయణ, బాల శివభక్తులుగా హనీష్, సహస్ర, దాసరిగా రుద్రనారాయణ, బుడత కీచకుడిగా డాక్టర్ మోహనరావు, రాజనర్తకిగా ఎస్.సరస్వతి తదితరులు చక్కని నటనతో రసోచితమైన పద్య పఠనంతో ఆద్యంతం ప్రేక్షకులను సమ్మోహన పరిచారు. వీరికి హార్మోనియంపై మీగడ మల్లికార్జున స్వామి, డోలక్‌పై కె.బాలకృష్ణ వాద్య సహకారం అందించారు. అలంకరణ, ఆహార్యం మీరా, సత్యం చేశారు. కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి సమక్షంలో జరిగిన నాటక ప్రదర్శనను పెద్ద సంఖ్యలో భక్తులు వీక్షించారు. ఈ సందర్భంగా స్వామి నాటక బృందాన్ని ఘనంగా సత్కరించారు.

స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకుడు రామస్వామి

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు చర్యలు చేపట్టాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు యు.రామస్వామి కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1231వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో పాల్గొన్న రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా విశాఖ ఉక్కు పురోభివృద్ధి సాధించగలదన్నారు. సెయిల్ నుంచి వేరు చేసే సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన వనరులు సమకూర్చుతామని హామీ ఇచ్చారని, కాని నెరవేర్చలేదు సరికదా లాభాల్లో ఉన్న ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టేసి నామమాత్రపు రేటుకు అమ్మేయాలని చూస్తుండడం దారుణమన్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావల్సిన మైన్స్ అనుమతులు వెంటనే ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.రామరావు, విల్లా రామ్మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.